# గ్లాసు పగిలింది — శ్రీరమణ

మామూలు సన్నివేశమే-మన ఇళ్ళలో తరచుగా కన్పించే దృశ్యమే-విన్పించే దృశ్యమే-

ఓ ఇంట్లో గాజుగ్లాసు చెయ్యి జారగా కిందపడి పగిలి పోయింది. దృశ్యం బీభత్సంగా వున్నా మొత్తమ్మీద హాస్య రసమే కన్పించింది.

ఎలాగంటారా-గ్లాసు పగలడానికి భర్త కారకుడైతే సీన్ ఒకలాగా వుంటుంది. అదే ఇంటికైన ఇల్లాలు కారణమైతే మరోలా వుంటుంది.

ఇంత వివరణ దేనికి? ఇదుగో ఇల్లు-గ్లాసు భర్త చేతిలోంచి జారిపడి పగిలింది-తర్వాత-

---

ఫెళ్ళున గ్లాసు పగిలిన శబ్దం. వెర్రి మొహంతో భర్త స్టేజి మీద నిలబడి వుంటాడు. బిలబిలా భార్య, కూతురు, కొడుకు పరుగెత్తుకు వస్తారు. భార్య పగిలిన పెంకుల వంక, భర్తవంక మార్చి మార్చి చూసింది. ఆ చూపుల తీవ్రత తట్టుకోలేక పోయాడు భర్త.

భర్త (రాని నవ్వు అభినయిస్తూ): అహ...అహ...మరీ...గ్లాసు చెయ్యి జారింది.

భార్య (కొంచెం తీవ్రంగా): చెయ్యి జారడం కాదు. పగిలిపోయింది.

కూతురు (దీర్ఘాలు తీస్తూ): మరి చెయ్యి జారితే పగలదూ - పగిలిన గాజు పెంకులు, చెదిరిన హృదయాల్లాంటివి. అవి ఎప్పటికీ అతకవు నాన్నా ... అతకవు

భర్త: ఊ-పర్లే వెధవ డైలాగులూ. నువ్వూను.

కొడుకు: పగిలిందోచ్... పగిలింది...నాన్నారు గ్లాసు బద్దలుకొట్టేశారోచ్... (గోముగా) అమ్మా! అమ్మా! యీ పెంకులన్నీ పొడిచేసి గాలిపటం మంజాదారాన్ని తీసుకుంటానే...

భార్య: పోండి అవతలికి... వెధవల్లారా... వెధవల్లారా

భర్త (రోషంగా): బహువచనం వాడుతున్నావ్... అంటే నన్నూ కలిపేశావన్న మాట.

భార్య: మిమ్మల్నెందుకంటాను? బావుంది మీ వరస... మొగుణ్ణి కొట్టి మొర్రో అన్నట్టు... ఊ అవలింతకీ ఏం తాగుతున్నారు ఆ గ్లాసుతో.

భర్త (విరాగ్గా): రామ... రామ పచ్చి మంచినీళ్ళే... నీ మీద ఒట్టు. అయినా ఏమిటే నీ ఎంక్వయిరీ ... ఛీ! ఛీ! యీ కొంపలో ప్రతిదానికీ రాద్ధాంతాలే.

భార్య: నేనేమన్నానని అంత యిదైపోతారు. కాపరానికొచ్చిందగ్గర్నించి చూస్తున్నా (వెక్కిళ్ళు)

భర్త: ఇదుగో ... వెవెక్కిళ్ళద్దు. వద్దు... దాని దుంప తెగా - ఎంత పెద్దా యింటికైన మొగాణ్ణే... ఒక్క గాజుగ్లాసు పగలగొట్టే హక్కు, అధికారం నాకు లేవా? వెధవ గ్లాసు... వెధవ గ్లాసు...

భార్య (బాధగా): పోతే పోయింది కానీ, వెధవ గ్లాసు అని మాత్రం అనకండి. అది మా పుట్టింటి సొమ్ము... రుణం తీరిపోయింది.

భర్త: ఇదా? ఇది ఇక్కడ కొన్నదే కదా-

భార్య (కళ్ళు వత్తుకుంటూ): అది కాదండీ ... పెళ్ళైన సంవత్సరం దసరాకి మా నాన్న మీకు శార్కిన్ ప్యాంటు కుట్టించలా? నీలం రంగుది...

భర్త (గొణుగుడు): ఏమోలే... ఏనాటి మాట.

భార్య: అది వెలిసిపోయి, పొట్టి అయిపోతే అదిచ్చి గ్లాసు తీసుకున్నా... అదండీ...



వినాయక చవితికి శ్రీరమణ విశిష్ట కానుక

భర్త: నువ్వు బాధపడకే... నువ్వే యిలా బెంబేలు పడి యిదైపోతే పిల్లలు మరీ యిదై పోతారు. మర్చిపోవే ... ఇదంతా ఓ పీడకలగా మర్చిపోవే.
భార్య: ఎలా మర్చిపోగలనండీ... అసలు మీకు మొదట్నించీ మా పుట్టింటి వాళ్ళంటే అలుసే. కసి వుంటే నన్ను కొట్టండి... తిట్టండి... అంతేగానీ...
భర్త (మూలిగి): ఊ అంత అదృష్టం కూడానా...
భార్య: అంతేగాని వాళ్ళిచ్చిన సామాను యిలా బద్దలు చేసేకండి.
భర్త: ఇదుగో యిహ ఆపు. అయిందేదో అయింది. ఇంకోటి కొందాం. మళ్ళీ మీ నాన్న ఎప్పటికైనా ఓ ప్యాంటు కుట్టించక పోతాడా?

భార్య (పెంకులు తీస్తూ): సర్లెండి... వాళ్ళని ఆడిపోసుకోడం దేనికి? చేశారుగా నిర్వాకం... పొద్దున్నే ఏ వెధవ మొహం చూశావో ఏమో ... విక్టోరియా లాంటి గ్లాసు.
భర్త: పొద్దున్నే యీ వెధవ మొహమే చూశావ్. ఇదుగో అనవే... అను. నిన్ను కట్టుకోగానే సిగ్గు, అభిమానం తీసి మీ వూరి పొలిమేరలో జువ్వి చెట్టుకి తగిలించేశా... కానీ... కానీ...
భార్య (ఒక్కసారి మారిపోయి): ఏమండీ! అంతలేసి మాటలనకండి. నా గుండె పగిలిపోతుంది. (ఏడుపు)
భర్త: చాలు చాలు గ్లాసు పగిలితేనే ఇంతైందా- ఇహ గుండె పగిల్తే బాబోయ్ భరించలేము-

ఈసారి వంతు భార్యది.

వెయ్యిజారడం, పగిలిపోవడం- ఎవరి చేతిలోంచి జరిగినా ఫలితం ఒక్కటే. కానీ సీన్ మరో విధంగా వుంటుంది.

చూడండి మరి-

గ్లాసు పగిలిన శబ్దం.
భార్య: అయ్యో...అయ్యో... రండర్రా... గ్లాసు పగిలిపోయింది.
భర్త (నవ్వుతూ - తాపీగా): పీడా వదిలింది - పెంకులు తీసెయ్.
భార్య: పక్కింటి పిన్నిగారి దిష్టేనండీ. నిన్న కాఫీ తాగుతుంటే చూసి "టంకంలాగా వుందమ్మా" అంది. నరుడి కంట నల్లరాయి పగుల్తుందంటారు. దాని కళ్ళల్లో నిప్పులు పడా...
భర్త: ఆవిడ్నెందుకే పాపం తిట్టడం? చెయ్యి జారింది ... కింద పడింది- పగిలి పోయింది.
భార్య: సర్లెండి. మీరెప్పుడూ ఆవిడ్నే వెనకేసుకు వస్తారు. ఆవిడ మాటంటేనే మీకు తీపి.
భర్త: శివ... శివా...
కూతురు (సాలోచనగా): ఇవ్వాల్టి పెంకులు నిన్నటి గ్లాసులు
ఇవ్వాల్టి గ్లాసులు రేపటి పెంకులు
కొడుకు: (పాఠం చదివినట్టు): ఊరుకో అక్కా - నీకేం తెలియదు
"భూమ్యాకర్షణ శక్తివలన ప్రతి వస్తువు భూమిచే ఆకర్షింపబడును. అందుచే గాలిలో వదిలిన వస్తువులు నేలపై బడుట సహజము..."
భర్త: ఊరుకోండి... అసలే అమ్మ బోలెడు బాధ పడ్తుంటే... (ఓదార్పుగా) అలివేలూ... నువ్విదేం మనసులో పెట్టుకోకు
భార్య: మీకేమండీ - మగ మహారాజులు. మీరలాగే చెబుతారు. పాపిష్టిదాన్ని ...వచ్చీ రాగానే విక్టోరియా లాంటి అత్తగార్ని పోగొట్టుకున్నాను. ఇప్పుడేమో యిది...
కొడుకు: అయితే అమ్మా! నాయనమ్మ, గాజుగ్లాసు ఒకటేనా?
భర్త: ఛీ! నువ్వసలు అవతలకి పో... వెధవ...
భార్య: (వెక్కిళ్ళు)
భర్త (లాలనగా చేతి వేళ్ళు చూస్తూ) నీ చేతికేం దెబ్బ తగల్లేదు కదా. అసలే గీసుకు పోవడం... అదీ
భార్య (గుసగుసగా నవ్వుతూ): ఛీ! ఏంటండీ... అవతల పిల్లలున్నారని కూడా లేకుండా ... సిగ్గన్నా లేదు...
భర్త: సర్లేవోయ్-

*



'పేదలకు తుపాకులు' — శ్యాం






జమ్ముకాశ్మీర్‌లో ప్రెస్ బిల్